# రైతులను అవహేళన చేస్తున్రు



మాట్లాడుతున్న మాజీ ఎంపీ నగేశ్

బోథ్, జూలై 19: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి రైతులకు మూడు గంటల కరెంట్ ఇస్తే సరిపోతుందని అవహేళన చేస్తున్నారని మాజీ ఎంపీ నగేశ్ అన్నారు. బుధవారం బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మండలంలోని కుచులాపూర్, దన్నూర్, చిన్నదన్నూర్, నాగాపూర్, నారాయణపూర్, మందబొగూడ, బీర్లగొంది గ్రామాల్లో ఆయన పర్యటించారు. కుచులాపూర్ ఎక్స్‌రోడ్డు వద్ద శ్రీ వేంకటేశ్వర స్వామి, గ్రామంలోని శ్రీ శబరిమాత ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా మాజీ ఎంపీ మాట్లాడుతూ రైతుల అభ్యున్నతి కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుంటే కాంగ్రెస్ నాయకులు బద్నాం చేస్తుందన్నారు. ప్రభుత్వం రైతులకు రైతుబంధు, 24 గంటల ఉచిత విద్యుత్, రైతు బీమాతో రూ.5 లక్షల సహాయం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తుల శ్రీనివాస్, తాంసి జడ్పీటీసీ రాజు, సహకార సంఘం అధ్యక్షుడు ప్రశాంత్, వెంకన్న, సర్పంచులు శ్రీధర్‌రెడ్డి, దేవేందర్, విజయ్, చంద్రమోహన్, రమేశ్, భీముడు, సాయన్న, సురేశ్, ఎంపీటీసీలు జుగాదిరావ్, మహిపాల్, దేవీదాస్, రాజేశ్వర్, మహేందర్, రోహిదాస్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆడె శీల పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన బీఆర్ఎస్ నాయకులు



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు, రైతులు

ఇచ్చోడ(సిరికొండ), జూలై 19 : సిరికొండ మండలానికి చెందిన లచ్చింపూర్, తుమ్మల్‌పాడ్, సాత్‌మోరి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, రైతులు బుధవారం ఖానాపూర్‌లో ఎమ్మెల్యే రేఖానాయక్‌ను కలిసి పోడు భూముల రీసర్వే, గ్రామాలకు బీటీ రోడ్డు వేయాలని వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా లచ్చింపూర్(బీ) ఉప సర్పంచ్ జాదవ్ గోవర్ధన్ నాయక్ మాట్లాడుతున్న ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రవీందర్, వినాయక్, భీంరావ్, సాత్‌మోరి పటేల్, లక్ష్మణ్ ఉన్నారు.

## సోలార్ యూనిట్లను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న టీఎస్ రెడ్కో మేనేజర్ వివర్తి

నేరడిగొండ, జూలై 19 : ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న సోలార్ యూనిట్లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని టీఎస్ రెడ్కో ఉమ్మడి జిల్లా మేనేజర్ వివర్తి సూచించారు. బుధవారం తేజాపూర్ గ్రామంలోని రైతు వేదికలో గ్రామస్తులకు సోలార్ యూనిట్ల వినియోగం, వాటితో కలిగే లాభాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం జిల్లాలో నేరడిగొండ మండలంలోని తేజాపూర్, ఇచ్చోడ మండలంలోని ముక్రా గ్రామాన్ని దత్తత తీసుకుందన్నారు. తేజాపూర్ గ్రామంలో ప్రతి ఇంటికి సోలార్ ద్వారా విద్యుత్ అందించడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొన్నారు. అలాగే స్వయం సహాయక సంఘాల సభ్యులకు స్త్రీనిధి ద్వారా యూనిట్లకు అయ్యే ఖర్చు మొత్తం రుణాలు అందజేస్తామని చెప్పారు. దీనికి గ్రామస్తులు ముందుకు వచ్చి సబ్సిడీ ద్వారా అందించే సోలార్ యూనిట్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రఫూల్‌చందర్‌రెడ్డి, స్త్రీనిధి ఆర్ఎం పూర్ణచందర్, అసిస్టెంట్ మేనేజర్ చిరంజీవులు, రవీందర్‌రెడ్డి, సీసీ కవిత, పంచాయతీ కార్యదర్శి సునీల్, గ్రామైక్య సంఘాల మహిళలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు నులిపురుగు నివారణ దినోత్సవం

భీంపూర్. జూలై 19 : భీంపూర్ పీహెచ్‌సీ పరిధిలోని అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీలు సహా ఇతర ప్రాంతాల్లో గురువారం జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు డాక్టర్ నిఖిల్‌రాజ్ తెలిపారు. 1 – 19 ఏళ్ల వారికి మాత్రలు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. బుధవారం పీహెచ్‌సీలో అవగాహన ఫ్లెక్సీలు ప్రదర్శించారు. కార్యక్రమంలో హెచ్ఈవో లింగంపల్లి జ్ఞానేశ్వర్, సూపర్‌వైజర్లు గంగాదర్, లూసి , సుజాత, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎడతెరిపి లేని వర్షం

- వాగులు, వంకల్లో పెరిగిన వరద ఉధృతి



బోథ్ : కౌఠ(బీ)లోని పత్తి చేనులో నిలిచిన నీరు

బోథ్, జూలై 19: బోథ్ నియోజకవర్గంలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నది. బోథ్‌లో 49.04 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షంతో రాంగనగర్ వద్ద కల్వర్టుపై నుంచి ఒర్రె పారడంతో కొద్దిసేపు రాకపోకలు నిలిచిపోయాయి. పత్తి, సోయా చేనుల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. వ్యవసాయ పనులకు ఆటంకం ఏర్పడింది. వాగులు, వంకల్లో వర్షపు నీటితో ప్రవాహం మొదలైంది.

### పొచ్చెర జలపాతానికి జలకళ

బోథ్ మండలంలోని పొచ్చెర జలపాతానికి జలకళ సంతరించుకుంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎగువనున్న పెద్దవాగు, ధన్నూర్(బీ) వాగుల్లో నీటి ప్రవాహం పెరిగింది. రెండు వాగుల్లోని నీరు జలపాతం వద్దకు వచ్చి చేరుతుండడంతో నీళ్లు ఎగిసి పడుతున్నాయి. జలపాతం వద్ద కొద్దిపాటి నీటి ప్రవాహం కనిపిస్తుండడంతో పర్యాటకులు అందాలు తిలకించేందుకు వస్తున్నారు.

ఇచ్చోడ, జూలై 19: సిరికొండ మండలం లచ్చింపూర్(కే) గ్రామంలో వర్షానికి కైలాస్ ఇల్లు కూలడంతో గాయాలయ్యాయి. అతడిని స్థానికులు దవాఖానకు తరలించారు. ఇంట్లో ఉన్న కుటుంబీకులు మీద ఏమి పడకపోవడంతో పెను ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఇచ్చోడ మండలం మేడిగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని గాయత్రి జలపాతం నీటి మట్టం పెరిగి కళకళలాడుతుంది. పర్యాటకులను ఆకట్టుకుంటుంది.

### భీంపూర్ మండలంలో..

భీంపూర్, జూలై 20 : భీంపూర్ మండలంలోని వాగులు, చెరువులు, పెన్‌గంగలోకి వరద వచ్చి చేరుతున్నది. పెన్‌గంగకు ఎగువ మహారాష్ట్ర ప్రాజెక్టు నుంచి వరదనీరు వదలడంతో ప్రవాహం క్రమంగా ఎక్కువవుతున్నది. సరిహద్దు గుబ్‌డి, అంతర్గాం, గోముత్రి, గొల్లగడ్, తాంసి(కే) పెన్‌గంగ రేవుల గుండా నాటుపడవలు నడపడం లేదు. ఆదిలాబాద్ – కరంజి(టీ) రోడ్డుపై వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పెన్‌గంగ ఒడ్డున ఉన్న గుబ్‌డి, కొజ్జన్‌గూడ, టేకిడిరాంపూర్ గ్రామాల వారు వాగుల కారణంగా బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. ఎస్ఐ రాధిక సిబ్బందితో గ్రామాల్లో తిరిగి అప్రమత్తం చేస్తున్నారు.

### తాంసి మండలంలో..

తాంసి, జూలై 19 : మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో వర్షం తెరిపినివ్వకపోవడంతో వ్యవసాయ పనులకు ఆటంకం కలిగింది. పత్తి, సోయా, కంది పంటల్లో కలుపు మొక్కల నివారణ, పురుగుల మందు పిచికారీ, ఎద్దుల సహాయంతో డౌర కొట్టడం వంటి పనులు నిలిచిపోయాయి. కూలీలు పనులకు వెళ్లలేక ఇబ్బందులు పడ్డారు. లోతట్టు ప్రాంతాల్లోని పంట పొలాల్లోకి వరద వచ్చి చేరింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని చెరువులు, కుంటలు నిండుకున్నాయి.

### నిండుకుండలా మత్తడి వాగు ప్రాజెక్టు

తాంసి, జూలై 19 : ప్రమాదకర స్థితిలో చేపలు పట్టొద్దని మత్తడి ప్రాజెక్టు డీఈ శ్రీనివాస్‌రావ్ అన్నారు. మహారాష్ట్ర ఎగువ ప్రాంతంలో భారీ వర్షం కురుస్తున్నందున మండలంలోని మత్తడి ప్రాజెక్టు నిండుకుండలా మారి జలకళను సంతరించుకుంది. మహారాష్ట్ర ప్రాంతం నుంచి మత్తడి ప్రాజెక్టులోకి 12 క్యూసెక్కుల వరద చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 277.50 మీటర్లు కాగా ప్రస్తుతం 275 మీటర్లుగా ఉంది. 0.570 టీఎంసీల సామర్థ్యం కాగా 0.287 టీఎంసీలుగా ఉంది. 8500 ఎకరాలకు సాగునీరు అందుతుంది. మత్తడి నిండుకుండలా మారిందని యువకులు జాగ్రత్తగా చేపలు పట్టాలని సూచించారు.

### కనకాయ జలపాతానికి జలకళ

బజార్‌హత్నూర్, జూన్ 19: మండలంలోని బలన్‌పూర్ గ్రామ సమీపంలో గల కనకాయ జలపాతానికి జలకళ సంతరించుకుంది. నాలుగు రోజులుగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు వరద భారీగా వచ్చి చేరడంతో జలపాతం గలగల పారుతుంది.

## నేడు నిపానిలో రైతుసభ

భీంపూర్, జూలై 19 : నిపాని గ్రామంలోని రైతు వేదికలో గురువారం ఉదయం 11 గంటలకు రైతుసభ నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ మండల కన్వీనర్ మేకల నాగయ్య, రైతుబంధు సమితి మండల కన్వీనర్ అనిల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభకు ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్ హాజరవుతారని పేర్కొన్నారు. ప్రతి గ్రామం నుంచి ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొనాలని కోరారు.

## వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న జీసీడీవో ఛాయ

నేరడిగొండ, జూలై 19 : వానకాలంలో వ్యాధులపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని జీసీడీవో మెస్రం ఛాయ సూచించారు. బుధవారం కుంటాల(కే) గ్రామంలోని బాలికల ఆశ్రమోన్నత పాఠశాలను సందర్శించారు. వర్షాలు కురుస్తుండడంతో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలు, మధ్యాహ్న భోజనం, పిల్లల ఆరోగ్య రికార్డులను పరిశీలించారు. వంట గది, పిల్లల డార్మెంటరీ శుభ్రంగా ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. ఆమె వెంట హెచ్ఎం ఆత్రం శంకర్ ఉన్నారు.

## పురోహితునికి సన్మానం

బోథ్, జూలై 19: బోథ్‌లోని సాయినగర్ కాలనీ అభయాంజనేయ స్వామి ఆలయంలో ధూప, దీప, నైవేద్యం కింద దేవాదాయ శాఖ ద్వారా నియమితులైన పురోహితుడు వన్నెల రాజును బుధవారం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రంగు రాజు, మేడిచెల్మ ప్రవీణ్, రూపేశ్, ప్రసాద్, పాపేశ్వర్, ఉప్పుల దాస్, గంగయ్య, సంతోష్, విజయ్, చంద్రమోహన్, లక్ష్మణ్ పాల్గొన్నారు.


## రెవెన్యూ డివిజన్‌కు మద్దతుగా రాజీనామా

బోథ్, జూలై 19: మర్లపెల్లి గ్రామ పంచాయతీ రెండో వార్డు సభ్యురాలు కట్ట శిరీష బోథ్ రెవెన్యూ డివిజన్‌కు మద్దతుగా బుధవారం తన పదవికి రాజీనామా చేశారు. మండల పంచాయతీ అధికారి జీవన్‌రెడ్డికి తన రాజీనామా పత్రాన్ని అందించారు. అనంతరం రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని సందర్శించి దీక్షలో కూర్చున్న మర్లపెల్లి గ్రామస్తులకు సంఘీభావం తెలిపారు.

## ఆర్థిక సాయం

ఇచ్చోడ(సిరికొండ), జూలై 19: సిరికొండ మండలం లచ్చింపూర్ గ్రామంలో వర్షానికి ఇల్లు గోడ కూలి గాయాలైన కైలాస్‌ను పోచంపెల్లి సర్పంచ్ జయశ్రీ లచ్చు పరామర్శించి రూ.2 వేలతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు. మెరుగైన వైద్యం కోసం తనవంతు కృషి చేస్తానని కుటుంబానికి భరోసా ఇచ్చారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



గ్రామస్తులకు మొక్కలు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో రాధ

బజార్‌హత్నూర్, జూలై 19: హరితహారం కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములై మొక్కలు విరివిగా నాటాలని ఎంపీపీ జయశ్రీ అన్నారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని పిప్పిరి గ్రామంలో ఎంపీడీవో రాథోడ్ రాధ గ్రామస్తులతో కలిసి మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం పల్లెప్రగతిలో భాగంగా పారిశుధ్య పనులను పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మురళి, పంచాయతీ కార్యదర్శి సాగర్, టెక్నికల్ అసిస్టెంట్ జాకీర్ పాల్గొన్నారు.